

చిందుయక్ష గాన ప్రదర్శన ఇస్తున్న గడ్డం సమ్మయ్య, కళాకారులు

జనగామ, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : ఆయనది మారుమూల పల్లెటూరు.. పేద కుటుంబం.. చదివింది ఆరో తరగతే.. కానీ రామాయణం, భారతం, భాగవత గాథలను పద్యరూపంలో పాడడంలో దిట్ట.. వందలాది గీతాలు, పద్యాలు, కీర్తనలు, శ్లోకాలు, వచనాలను రాగబద్ధంగా తన గంభీర స్వరంతో పాడడమే గాక దుర్యోధనుడు, కృష్ణుడు, కంసుడు, రావణుడు, లోహితాస్యుడు, సిరియాళుడు, బాలవర్ధి, సత్య హరిశ్చంద్రుడు, కీచకుడు, కంసుడు వంటి పాత్రలు వేసి యక్షగాన ప్రదర్శనలతో మెప్పించారు. ఎన్నో వేదికలపై వేలాది ప్రదర్శనలిచ్చి తన అపార అనుభవంతో జానపద కళ చిందు యక్షగానానికి జీవం పోశాడు. ఇలా ఐదు దశాబ్దాలుగా తన జీవితాన్ని కళకే అంకితం చేసిన అప్పిరెడ్డిపల్లి ముద్దుబిడ్డ గడ్డం సమ్మయ్యను ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారం వరించింది. దేశం కీర్తించే స్థాయిలో ఉమ్మడి వరంగల్ జిల్లా గర్వించేలా చేసింది. జనవరి 22న అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా యక్షగానంలో రామాయణాన్ని ప్రదర్శించే అరుదైన అవకాశం ఈయన బృందానికి దక్కగా.. 'ప్రదర్శనకు మెచ్చి శ్రీరాముడే ఇచ్చిన కానుక ఈ పద్మశ్రీ' అని చెబుతున్నారు సమ్మయ్య. అవార్డుకు ఎంపికైన సందర్భంగా 'నమస్తే తెలంగాణ'తో ఆయన ముచ్చటించారు.



# నా జీవితం ధన్యమైంది..

**కళకు అంకితం.. వరించెను పద్మం..**

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

**ఇది అయోధ్య రాముడు ఇచ్చిన కానుక**

- ఐదు దశాబ్దాలుగా 25వేల ప్రదర్శనలిచ్చిన
- తెలంగాణ వచ్చాకే చిందుకళకు గుర్తింపు..
- 'పద్మశ్రీ' రావడం ఎంతో సంతోషంగా ఉంది
- 'నమస్తే తెలంగాణ'తో చిందు యక్షగాన కళాకారుడు సమ్మయ్య
- మురిసిపోతున్న అప్పిరెడ్డిపల్లి..

### తండ్రే నా గురువు..

మా ఊరు అప్పిరెడ్డిపల్లి. దేవరుప్పుల మండలం చిన్నమడూరు నుంచి కోలు కొండ మార్గంలో చిన్న పల్లెటూరు. మేం ముగ్గురు అన్నదమ్ములం. చిందు యక్ష గానాన్ని నమ్ముకున్నం. మా తండ్రి రామస్వామి నా గురువు. ఆయన వారసత్వంగా వచ్చిన కులవృత్తి చిందుయక్ష గానాన్ని నేర్చుకున్న. నా కుమారుడు సోమరాజు కూడా ఈ వృత్తిలోనే రాణిస్తున్నాడు. చిన్నచిన్న ప్రదర్శనలు ఇస్తూనే ఉదయం, సాయంత్రం మా కుటుంబ సభ్యుల్లోని చిన్నారులు సహా మరికొందరిని ఇంటి అరుగు మీదు కూర్చోబెట్టుకొని మద్దెలదరువు, హార్మోనియం, వాయిద్యంతో రామాయణ, భారత, భాగవత ఇతిహాస గాథలను పద్యరూపంలో నేర్పిస్తా. నా బృందంలో అన్ని వయసుల వారు సుమారు 18మందికి శిక్షణ ఇచ్చాను. ఇప్పుడు వీరంతా వివిధ ప్రదర్శనల్లో అనేక పాత్రలను అలవోకగా పోషిస్తారు. నా బృందంలోని 12మంది సభ్యులకు 40కి పైగా ప్రదర్శనలకు సంబంధించిన పద్యాలు, గీతాలు, కీర్తనలు, వచనాలు కంఠతా వస్తాయి. ఈ బృందంలో నా పెద్ద కొడుకు సోమరాజు సుభద్ర, సుధేష్ణ వంటి స్త్రీ పాత్రలు ధరించి కండ్లకు కట్టినట్లు ప్రదర్శన ఇవ్వడంలో మేటి.

### పద్మశ్రీ వచ్చిందంటే నమ్మలే..





సమ్మయ్య.. నువ్వు 'పద్మశ్రీ' అవార్డుకు ఎంపికైనవ్ అని ఎవరో చెబితే నమ్మలే. సామాన్యుడినైన నాకు అంత పెద్ద అవార్డు ఎలా ఇస్తారనుకున్నా. తర్వాత టీవీలో నా పేరు, ఫొటోతో సహా రావడం చూసి నోటమాట రాలేదు. ఆ ఆనంద క్షణాలు నా జీవితానికి సంతృప్తినిచ్చాయి. నా భార్య, పిల్లలు, కుటుంబం సంబురానికి హద్దులేదు. నేను పుట్టి పెరిగిన ఊరు అప్పిరెడ్డిపల్లి పేరు దేశం యావత్తు మార్మోగుతుంటే చూసి జీవితం ధన్యమైంది. భారత ప్రభుత్వం తమ పల్లె కళాకారుడిని ఎంపికచేసినందుకు ఊరంతా మురిసిపోయింది. జిల్లా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మామిడాల యశస్వినీరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహా రాష్ట్ర, జిల్లా అధికారులు, ఇంకా పెద్దపెద్ద సార్లు ఇంటికి వచ్చి సన్మానించి అభినందించడం మరిచిపోలేని ఘట్టం.

### వారసత్వ వృత్తి చిందుయక్ష గానం..

కొద్దిమంది మాత్రమే ఉన్న మా చిందు కుటుంబాలు ప్రదర్శనలు ఇస్తూ సంచార జీవితం గడిపేవి. మా తల్లిదండ్రులు రామస్వామి-ఛండికాంబ కొన్నేండ్ల కిందట జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని మారుమూల అప్పిరెడ్డిపల్లిలో స్థిరపడ్డారు. నా భార్య పేరు శ్రీరంజని, మాకు ముగ్గురు కుమారులు సోమరాజు, హిమగిరి, మురళీకృష్ణ. ఊరిలో ఆరో తరగతి వరకు చదువుకున్నా. తల్లిదండ్రుల స్ఫూర్తితో చిన్నప్పటి నుంచి కులవృత్తే నాకు సర్వస్వం. 14 ఏళ్ల వయసులో నా తండ్రి ప్రోత్సాహంతో చిన్నికృష్ణుడి వేషధారణతో కళారంగంలోకి అడుగుపెట్టి, సమాజహితం, సామాజిక, కులవృత్తి పరిరక్షణలో సాంస్కృతిక రంగాన్ని వారసత్వంగా ఎంచుకొని చిందు యక్షగానాన్ని నమ్ముకొని ప్రదర్శనలు ఇచ్చి అందరి నోటా 'శభాష్ సమ్మయ్య' అనిపించుకున్న. 50 ఏండ్లుగా నా జీవితాన్ని కులవృత్తికి అంకితం చేసిన ఫలితంగానే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చిందుయక్ష గాన కళను గుర్తించి ప్రపంచానికి తెలిసే కళాకారుడిగా అత్యున్నత పురస్కారానికి ఎంపిక చేసింది.

### రాష్ట్రం వచ్చినంకనే చిందుకళకు గుర్తింపు..

వారసత్వంగా వచ్చిన చిందు యక్షగానాన్ని నమ్ముకొని సమాజహితం, సామాజిక, కులవృత్తి పరిరక్షణలో సాంస్కృతిక రంగంలో అడుగుపెట్టి దేశవ్యాప్తంగా దాదాపు 25వేల ప్రదర్శనలు ఇచ్చిన. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే చిందు యక్షగాన కళను గుర్తించి కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చిందు యక్షగాన కళాకారుల ప్రదర్శనలు ప్రజలను చైతన్యం చేసేలా, ప్రభుత్వాలను మేల్కొలిపేలా, హెచ్చరికలు చేసే బాణీలో ఉండేవి. 2017లో జానపద కళల విభాగంలో తొలిసారి నేను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా 'తెలంగాణ ఆవిర్భావ పురస్కారం' అందుకోవడం మరచిపోలేని ఘట్టం. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన 34మంది ప్రముఖులకు ప్రకటించిన ప్రతిష్టాత్మక అవార్డుల్లో చిందు యక్షగాన కళను చేర్చి నన్ను అరుదైన పురస్కారానికి ఎంపిక చేసిన ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు. జనగామ జిల్లా అనేక మంది కళాకారులకు పుట్టినిల్లు.. ప్రాచీన చిందు యక్షగానం సహా ఒగ్గు కళకు ప్రసిద్ధి. అలాంటి ప్రాంతానికి వన్నెతెచ్చేలా కేంద్ర ప్రభుత్వం నన్ను పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయడం గర్వంగా ఉంది.





వేలేరులో ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

**సర్వసభ్య సమావేశాలకు పూర్తి సమాచారంతో రావాలి**

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**వేలేరులో అధికారులతో ప్రత్యేక సమావేశం**

వేలేరు, జనవరి 30 : అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో మండల సభకు హాజరుకావాలని, క్రమశిక్షణతో పని చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వేలేరు రైతు వేదిక భవనంలో ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి అధ్యక్షతన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించి పల్లెప్రగతి అనే బృహత్తరమైన కార్యక్రమం అమలు చేసిందన్నారు. దీంతో గ్రామాలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి సాధించాయని చెప్పారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయిస్తానని సర్పంచ్‌లకు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో కేటీఆర్ రూ.104కోట్లతో ప్రారంభించిన సాగునీటి పనులను త్వరగా పూర్తి చేయిస్తానని పేర్కొన్నారు. వేలేరులో మండల కాంప్లెక్స్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. హనుమకొండ నుంచి వేలేరు మీదుగా జనగామ వరకు డబుల్ రోడ్డు వేయించాలనే కోరిక ఉందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా లేదన్నారు. రాష్ట్ర ఆదాయానికి మించి కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చిందని, వాటిని నెరవేర్చడంలోనే జాప్యం చేస్తున్నదని, ఇంకా కొత్త పనులను చేపట్టే అవకాశం లేదని విమర్శించారు. కాగా, పూర్తి సమాచారం లేకుండా హాజరైన విద్య, వైద్య శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని మల్లికుదుర్ల శివారులో ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్ జరుగుతున్నదని జడ్పీటీసీ చాడ సరితారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, మైనింగ్ పర్మిషన్ ఇవ్వొద్దని అధికారులను ఆదేశించారు. మట్టిని తరలించే వాహనాలను సీజ్ చేయాలని అధికారులకు సూచించారు. అలాగే కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్లపై వెళ్లకుండా జీపీల్లో తీర్మానాలు చేయాలని సర్పంచ్‌లకు చెప్పారు. అంతకుముందు పీచరలోని సమ్మక్క-సారలమ్మల తల్లులను దర్శించుకుని జాతర ఏర్పాట్లు ఘనంగా చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, వైస్‌ఎంపీపీ సంపత్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు కాయిత మాధవరెడ్డి, మండలాధ్యక్షుడు నర్సింహారావు, పీచర జాతర కమిటీ చైర్మన్ మహేందర్, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ కొమి, ఎంపీవో విమల పాల్గొన్నారు.

# త్వరలో ఉప ఆలయాల పునరుద్ధరణ

- రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ భారతీ హోలీకేరి
- రామప్పలో ఉపాలయాల పునర్నిర్మాణం కోసం పరిశీలన



రామప్ప చెరువు వద్ద ఉన్న ఆలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ భారతీ హోలీకేరి, అధికారులు

వెంకటాపూర్, జనవరి 30 : త్వరలో రామప్ప ఉప ఆలయాల పునరుద్ధరణ పనులు చేపడుతామని రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ భారతీ హోలీకేరి అన్నారు. మంగళవారం ఆమె రామప్ప ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ స్వాగతం పలికి రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో శాలువాతో సత్కరించి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం రామప్ప చెరువు వద్ద త్రికూటాలయం, శివాలయం, కల్యాణ మండపం, భైరవగుడి, హెలిప్యాడ్ వద్ద ఆలయం, జాకారం శివాలయాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. ఉప ఆలయాల పునర్నిర్మాణం పరిశీలన కోసం వచ్చినట్లు భారతీ హోలీకేరి తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అన్నారు. ఆమె వెంట డిప్యూటీ డైరెక్టర్ బీ నారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్లు మల్లు నాయక్, నర్సింగ్ నాయక్, పురావస్తు, టూరిజం, దేవాదాయ శాఖల సిబ్బంది ఉన్నారు.

# బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

**చరిత్రలో నిలిచిపోనున్న సర్పంచ్‌లు**

**ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



నర్మెట మండల సర్పంచ్‌లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నర్మెట, జనవరి 29: భారతదేశంలోనే అత్యంత ఎక్కువగా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు బీఆర్‌ఎస్ పాలనలోనే ఉన్నాయని, ప్రస్తుత సర్పంచ్‌లు చరిత్రలో నిలిచిపోతారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ కేసీఆర్ పాలనలోనే గ్రామాల్లో సీసీ రోడ్లు, వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలు, వన నర్సరీలు ఏర్పాటయ్యాయని చెప్పారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, హరితహారంతో ప్రజల జీవన విధానంలో మార్పులు వచ్చాయని అన్నారు. పల్లెలు, తండాలు జీపీలుగా మారాయని తెలిపారు. ప్రస్తుత సర్పంచ్‌లు చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేశారని పల్లా వివరించారు. సర్పంచ్‌లు మిగిల్చిపోయిన పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తుండడంతో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్, ఎంపీడీవో ఖాజనయీమొద్దీన్, తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గద్దల నర్సింగరావు, ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది రాజిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

# మహా జాతర విజయవంతానికి సహకరించాలి

**మేం పోలీస్ డ్రెస్‌లో ఉన్న భక్తులం**

**పూజారులతో ములుగు ఎస్పీ శబరీష్**



పూజారులకు పాస్‌లను అందిస్తున్న ఎస్పీ శబరీష్

తాడ్వాయి, జనవరి 30 : మహా జాతర విజయవంతానికి సహకరించాలని ములుగు ఎస్పీ శబరీష్ అన్నారు. మేడారం పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం పూజారులు, యువతతో ఎస్పీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు జాతర సందర్భంగా పూజారుల సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. వారికి కల్పించాల్సిన సౌకర్యాలు, గద్దెలతో పాటు తల్లులకు పూజలు చేయాల్సి ఉంటుందని, జాతర సమయంలో పోలీసులు తమను లోనికి అనుమతించడం లేదన్నారు. సమ్మక్కను గద్దెపైకి తీసుకొచ్చే సమయంలో దారివెంట మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలన్నారు. గతంలో భక్తులు తల్లిని ముట్టుకునేందుకు పోటీ పడటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజును తీసుకువచ్చే క్రమంలో ఎదురయ్యే సమస్యలను ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పూజారులకు, పూజా కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడతామని, తల్లులను తీసుకువచ్చే క్రమంలో మరింత భద్రతను పెంచుతామన్నారు. ఇందుకు డీఎస్పీ స్థాయి అధికారులను నియమించనున్నట్లు చెప్పారు. అనంతరం పూజారులు, యువతకు ఎంట్రీ పాస్‌లను అందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు రవీందర్, సుభాష్, సీఐ శంకర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

# దేవాదాయ శాఖ ఆధీనంలోకి గట్టమ్మ

ములుగురూరల్, జనవరి 30 : ములుగు జిల్లా గట్టమ్మ దేవాలయాన్ని మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. గట్టమ్మ వద్ద తాత్కాలిక దుకాణాల ఏర్పాటు, ఇతర అంశాలపై జాకారం జీపీ పాలకవర్గ సభ్యులతో పాటు పూజారులతో తన కార్యాలయంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఎల్‌పీవో స్వరూపారాణి, ఇతర అధికారులు సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ మాట్లాడుతూ సమావేశానికి దేవాదాయ శాఖ తరపున హాజరైన అధికారి రాజేందర్ 2014లోనే గట్టమ్మ దేవాలయం దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చిందని తెలిపారన్నారు. అప్పటి నుంచి తమ శాఖ ఆధీనంలోకి పూర్తిగా గట్టమ్మ రాలేదని పేర్కొని ఇప్పుడు తమ శాఖలోకి పూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులను చూపించారని తెలిపారు. జాతర నిర్వహణలో భాగంగా దేవాదాయ శాఖతో పాటు గట్టమ్మ పూజారులతో కలిసి తాత్కాలిక దుకాణాలు సైతం ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2014 నుంచి జరిగిన జాతరల సందర్భంగా వచ్చిన ఆదాయం రెవెన్యూ శాఖ వద్ద ఉందని, దానిని సైతం దేవాదాయ శాఖ ద్వారా స్వాధీనం చేసుకుంటామని వెల్లడించారని ఆయన చెప్పారు.

# అయోధ్యకు ఆస్థా ప్రత్యేక రైలు రద్దు

**స్టేషన్‌కు వచ్చి వెనుదిరిగిన భక్తులు**

కాజీపేట, జనవరి 30: కాజీపేట రైల్వే జంక్షన్ నుంచి అయోధ్య వరకు ఏర్పాటు చేసిన ఆస్థా ప్రత్యేక రైలును రైల్వేశాఖ మంగళవారం సాయంత్రం రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. దీంతో భక్తులు వెనుదిరిగి వెళ్లారు. సాంకేతిక కారణాలతో ఆస్థా రైలును రద్దు చేశామని, టికెట్ తీసుకున్న ప్రతి ఒక్కరికీ 24 గంటల ముందే రైల్వే శాఖ మెసేజ్ పంపిందని అధికారులు తెలిపారు.

# 2న ఇండోర్ స్టేడియంలో మెగా జాబ్ మేళా

హనుమకొండ చౌరస్తా, జనవరి 30: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 2న తెలంగాణ రాష్ట్ర ఉపాధి దోహద శిక్షణ సంస్థ సహకారంతో ధృవ్ కన్సల్టింగ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి యువజన క్రీడల అధికారి సయ్యద్ అబ్దుల్ నయీం తెలిపారు. https://forms.gle/aWH1uo5poS6RrT3D6లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 7097655912, 8886711991, 9642333668 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


